క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నరసింహ జయంతి



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: మండలంలోని సింగిరి కోనలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం నరసింహ జయంతి సందర్భంగా అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. ఉదయం 10 గంటలకు శ్రీదేవీ, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి మూలవర్లకు అభిషేకాలను నిర్వహించి వెండి కవచాలు, సుగంధ పుష్పాలతో అలంకరించారు. కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణాన్ని జరిపించారు. సాయంత్రం ఊంజల్‌సేవ అనంతరం ఆస్థానం నిర్వహించారు. ట్రస్టీ సభ్యులు గిరిబాబు, భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరునికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న పట్టుశాలీలు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి స్థానిక వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి దేవస్థానం పట్టు వస్త్రాలను సమర్పించింది. బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం అనంతరం ఉత్సవర్లకు పట్టుశాలీలు పట్టువస్త్రాలను సమర్పించడం సంప్రదాయంగా కొనసాగుతోంది. ఆదివారం ఉదయం వీరరాఘవస్వామి దేవస్థానం నుంచి మేళతాళాలతో పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ధ్వజారోహణం అనంతరం ఉత్సవమూర్తులకు సమర్పించారు.

శాస్త్రోక్తంగా పరిహార పూజలు



గురు భగవానుడికి పూజలు చేస్తున్న అర్చకులు

నాగలాపురం: సురుటుపల్లిలోని సర్వమంగళ సమేత పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు గురు సంక్రమణ సందర్భంగా గురుసంచార పరిహార పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్, ఆలయంలో గురు భగవానుడి ప్రత్యేక విగ్రహం ఏర్పాటు చేసి పసుపు, కుంకుమ, పూలతో సుందరంగా అలంకరించి అభిషేకాలు చేశారు. అనంతరం గురు భగవానుడికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పరిహార పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణ అధికారి లత పర్యవేక్షించారు.

ముమ్మర తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర ఆదివారం తమ సిబ్బందితో కలిసి బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు చేశారు. అనుమానితుల బ్యాగులను పరిశీలించారు. వారి చిరునామా తదితర వివరాలపై ఆరా తీశారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న సీఐ జయచంద్ర

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం అర్బన్ సీఐ జయచంద్ర కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించొద్దన్నారు. ప్రతి ఒక్కరిపైనా పోలీసుల నిఘా ఉందని తెలిపారు. గొడవలకు పోకుండా మంచిగా ఉండాలని సూచించారు.

ఘనంగా మదర్స్ డే



కేక్ కట్ చేస్తున్న తల్లులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ఈసీఐ చర్చిలో ఆదివారం మదర్స్ డేను ఘనంగా నిర్వహించారు. తల్లులతో కేక్ కట్ చేయించారు. స్వీట్స్ పంపిణీ చేశారు. తల్లుల సేవలను కొనియాడారు.

నిర్లక్ష్యం



బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని పుత్తేరి గ్రామంలోని ఎస్టీ కాలనీలోని రెండు వీధుల్లో పది రోజులుగా విద్యుత్ సరఫరా కావడం లేదు. విద్యుత్ తీగలు నేలమీద వున్నాయి. అటువైపు ఎవరైనా వెళితే ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బోరు మోటారుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఎస్టీలు తాగునీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఎస్టీ కాలనీలోని విద్యుత్ సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఎస్టీలు వాపోతున్నారు.

- బుచ్చినాయుడుకండ్రిగ

ప్రయాణం ఎలా?



వరదయ్యపాళెం: సత్యవేడు మండలం మాదనపాళెంకు వెళ్లే ప్రధాన రోడ్డు కంకర తేలడంతో గ్రామస్తులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు సైతం తమ వాహనాలను ఆ మార్గంలో నడపలేకపోతున్నారు. అలాగే వరదయ్యపాళెం మండలంలోని గోపాలరావుకాలనీకి వెళ్లే మార్గం సైతం అదే పరిస్థితి. పూర్తిగా కంకర తేలిన రహదారిలో స్థానికులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఓవైపు కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సంక్రాంతి కల్లా ప్రతి రోడ్డు అభివృద్ధి చెందుతుందని ప్రగల్భాలు పలికారు. అయితే సంక్రాంతి వెళ్లి 4 మాసాలు పూర్తవుతున్నా నేటికీ గ్రామీణ రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

చిమ్మచీకట్లో..



రేణిగుంట మండలం కరకంబాడి నుంచి తిరుపతి మంగళం వరకు ఉన్న ప్రధాన రహదారిలోని లైట్లు వెలగడం లేదు. ఈ రోడ్డులో వాహనాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. అంతేగాక అటవీప్రాంతం దగ్గరగా ఉండడంతో రాత్రిళ్లు వన్యమృగాలు రోడ్డుపైకి వస్తుంటాయి. అదేవిధంగా వెంకటాపురం నుంచి కరకంబాడికి రాత్రి సమయంలో అనేకమంది నడుచుకుంటూ, సైకిళ్లలో వెళుతూ ఉంటారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి లైట్లు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. -రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్)

నర్సులు..సేవా మూర్తులు

- వైద్యుల తర్వాత స్థానం వారిదే
- ప్రాథమిక వైద్యమంతా వారి చేతుల మీదుగానే
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



వరదయ్యపాళెం మండలంలో వైద్యసేవలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

వరదయ్యపాళెం: అవయవాలు పాడై అంత్య దశలో ఉన్న రోగులను వారు ఆత్మీయంగా పలకరిస్తారు.. కుటుంబసభ్యులా ఆదరిస్తారు.. అన్ని సేవలు చేస్తూ ఆప్తులుగా నిలుస్తారు.. స్వస్థత చేకూరేందుకు సహాయ సహకారాలు అందిస్తారు..సాటి మనిషి పట్ల ప్రేమ, జాలి, కరుణ, సహనం ఉన్న వీరు నర్సులుగా, సేవామూర్తులుగా ప్రశంసలు అందుకుంటున్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ చేసిన సేవలకు గుర్తుగా మే 12వ తేదీ ఆమె జయంతి సందర్భంగా ప్రతి ఏడాది అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహిస్తారు. సత్యవేడు నియోజకవర్గంలో ఇలా.. నియోజకవర్గం పరిధిలో వరదయ్యపాళెం, కేవీబీపురం, బీఎన్ కండ్రిగ, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాల పరిధిలో 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, 71 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ఇందులో నర్సులు, హెడ్ నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీలు రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు.

15ఏళ్లుగా సేవ చేస్తున్నా..



వైద్య వృత్తిలో 15ఏళ్లుగా స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్నా. విధి నిర్వహణలో వచ్చిన రోగులను ఆప్యాయంగా పలకరించి వైద్యం అందించడం ఎంతో సంతృప్తినిస్తోంది. వైద్య వృత్తి దేవుడిచ్చిన వరంలా భావించి పనిచేస్తున్నాను.

- భారతి, స్టాఫ్‌నర్స్, సీహెచ్‌సీ, సత్యవేడు

సేవా దృక్పథంతో పనిచేస్తున్నా..



నాగలాపురం పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నా. రోగుల పట్ల సేవాదృక్పథంతో విధులు నిర్వర్తించడం సంతృప్తినిస్తోంది. ఆస్పత్రిని ఆశ్రయించేవారికి తమ చేతుల మీదుగా ప్రాథమిక వైద్యం చేయడం ఎంతో ఆనందాన్నిస్తుంది. వైద్యం విషయంలో రాజీ లేకుండా సేవలందిస్తున్నాం. - సుగవేణి, స్టాఫ్‌నర్సు, పీహెచ్‌సీ, నాగలాపురం

టెలీ మెడిసిన్‌తో మెరుగైన వైద్యం..



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 67 రకాల మందులు, 14 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. గ్రామంలోని వృద్ధులకు, గర్భవతులకు, పేదలకు వైద్యం అందిస్తున్నాం. రోగులకు అవసరమైతే టెలీ మెడిసిన్‌తో వీడియో కాల్ ద్వారా డాక్టర్లను సంప్రదించి మందులు ఇస్తున్నాం.

- షీబా, ఎంఎల్‌హెచ్‌పీ, ఎస్ఎస్‌పురం, నాగలాపురం మండలం

వృత్తిపరంగా గర్వంగా ఉంది..



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేయడం గర్వంగా ఉంది. మా సేవలను మెచ్చుకుని కృతజ్ఞతలు చెబుతుంటే ఆనందంగా ఉంది. రోగికి ఏదైనా అనుమానం వస్తే వెంటనే టెలీ మెడిసిన్‌కు ఫోన్ చేసి వీడియో కాల్ ద్వారా వైద్యుల సలహాలు తీసుకుని రోగులకు మందులు అందేలా చర్యలు తీసుకుంటాను. - గాయత్రి, సీహెచ్‌ఓ, నాగలాపురం మండలం

ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి



నరసింహస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆకాంక్షించారు. లక్ష్మీ నరసింహ స్వామి జయంతి సందర్భంగా ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని లోబావి సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి వారి కృపాకటాక్షాలు శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రజల కోసమే శ్రమించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో విలసిల్లాలని స్వామిని ప్రార్థించినట్టు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, రేణిగుంట జెడ్పీటీసీ సంధ్యారాణి, పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, యువజన విభాగం అధ్యక్షుడు శ్రీవారి సురేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్, మున్నా రాయల్, కంఠా ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా లక్ష్మీ నరసింహస్వామికి పూజలు



శ్రీకాళహస్తి: భక్త కన్నప్ప కొండపై ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం నృసింహ జయంతి వేడుకలను ఆగమోక్తంగా నిర్వహించారు. ముందుగా లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉదయం 7 గంటలకే మద్యం విక్రయాలు



మద్యం విక్రయిస్తున్న యాజమాని

నాగలాపురం: మండల కేంద్రంలోని ఓ టీడీపీ నేతకు చెందిన మద్యం దుకాణం వద్ద ఉదయం 7 గంటలకే మద్యం విక్రయం జోరుగా సాగుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటలకు వరకు మద్యం విక్రయించాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని టీజేఆర్ మద్యం దుకాణం వద్ద నిర్వాహకుడు విచ్చలవిడిగా ఉదయమే అమ్ముతున్నా అటువైపు కన్నెత్తి చూడకుండా ఎక్సైజ్ అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాటిల్‌పై రూ.50 నుంచి రూ.70 అదనంగా విక్రయిస్తున్నారు. ఎక్సైజు శాఖ ఉన్నతాధికారులు మద్యం దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాసమస్యలపై పోరాటాలు ఉధృతం





హరిప్రసాద్‌రెడ్డి, బావులూరు అంకయ్యలను సత్కరిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ప్రజాసమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటీవల నియమితులైన వి.హరిప్రసాద్ రెడ్డి ఆదివారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి రాజకీయ కక్షతో ప్రజలపై అక్రమ కేసులు నమోదు చేస్తోందన్నారు. వాటిని ఎండగట్టాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షేక్ సిరాజ్ బాష, కామీ వెంకటేశ్వర్లు, డీజే సుధీర్ కుమార్, సదాశివ, యూనివర్సిటీ ఇన్‌చార్జి పోతు మురళీధర్, హేమంత్ కుమార్ రెడ్డి, నరేష్, జ్ఞానేందర్ రెడ్డి పాల్గొన్నారు

పార్టీ బలోపేతానికి కృషి

శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరికి చెందిన బావులూరు అంకయ్య తెలిపారు. ఆయన ఇటీవల వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్‌సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన ఆదివారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని వారి స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, వెంకటేష్‌నాయుడు, నాగరాజరెడ్డి, పులి రామచంద్ర, నారాయణ, మునిరాజా, రవి, దిలీప్, యాకూబ్, చందు, గురుప్రసాద్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దాహార్తికి హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని కేవీబీపురం మండలం, మర్రిగుంట గ్రామస్తుల తాగునీటి అవసరాలకు హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. ఆ మేరకు గ్రామస్తుల వినతి మేరకు గ్రామంలో నెలకొన్న తాగునీటి ఇబ్బందులను ట్రస్టు దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు వారు తమ సొంత నిధులతో బోరును వేసి దానికి చేతిపంపును అమర్చి గ్రామస్తుల తాగునీటి అవసరాలకు వినియోగంలోకి తెచ్చారు. ఆ మేరకు ఆదివారం బోరును లాంచనంగా ప్రారంభించారు. సేవాదృక్పథంతో స్పందించిన ట్రస్టు యాజమాన్యానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్టు ప్రతినిధులు వినయ్‌కుమార్, లాలు, కరీముల్లా, భాస్కరరావు, గుణశేఖర్, రజనీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.



చేతిబోరును ప్రారంభిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

రాజీవ్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు



మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఆదివారం రాజీవ్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 4 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. వారు మాట్లాడుతూ ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవన్నారు.

శాస్త్రోక్తంగా గురు సంక్రమణ పరిహార పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని పుష్పగిరి మఠంలో ఆదివారం శివశక్తి సేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురు సంక్రమణ పరిహార హోమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. బృహస్పతి వృషభ రాశి నుంచి మిథున రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా ఈ పూజలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన చేశారు. అనంతరం హోమం చేశారు. ఇందులో భాగంగా గణపతి, లక్ష్మీ గణపతి, గురు సంక్రమణ పరిహారం పూజలు చేశారు. తదుపరి కలశ జలంతో బృహస్పతికి అభిషేకం చేశారు. భారతదేశం పాకిస్తాన్‌పై అఖండ విజయం సాధించాలని సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివశక్తి సేవా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు జయసుధ, కార్యదర్శి సిద్దులయ్య నాయుడు, కోశాధికారి నీలకంఠం గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

-పెద్ద శేష వాహనంపై వేంకటేశ్వరుడు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు



పెద్దశేష వాహనంపై ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారు పెద్ద శేషవాహనంపై పరమపదనాథునిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ మాడ వీధుల్లో విశ్వక్సేన, చక్రత్తాళ్వార్, కొడిపార్వ వస్త్రంతో ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరిగింది. అనంతరం ఆలయంలో ధ్వజస్తంభానికి అభిషేకాలను నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య గరుడాళ్వార్ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అర్చకులు అధిరోహింప చేయడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 12.30 గంటలకు ఉత్సవమూర్తులకు ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించి దీప, ధూప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామి వారు ఉభయ నాంచారులతో పరమపదనాథునిగా ఊంజల్‌సేవలో పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు పెద్ద శేష వాహనంపై విశేష అలంకరణతో అధిష్టించారు. మంగళవాయిద్యాలు, కోలాటాలు, బాలికల నృత్యాలతో భక్తుల గోవింద నామస్మరణల మధ్య స్వామి వారి ఊరేగింపు గ్రామ వీధుల్లో కొనసాగింది. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించిన అర్చకులు భోగశ్రీనివాసునికి ఏకాంత సేవతో ఆలయ ద్వారాలను మూశారు. డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఇంజినీరింగ్ శాఖ ఈఈ మల్లిఖార్జున ప్రసాద్, డిప్యూటీ ఈఈ భాస్కర్, ఆలయ అధికారి నాగరాజు, ఏఈ గురుమూర్తి, ప్రధానఅర్చకులు శ్రీధరభట్టాచార్య పర్యవేక్షించారు. ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం ఉదయం చిన్న శేష వాహనం, రాత్రి హంసవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అన్నప్రసాదాల వితరణ

బ్రహ్మోత్సవాల్లో భక్తులకు శ్రీనివాసా డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో అన్నప్రసాదాల వితరణ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ ఈఓ నాగరత్న తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ఉదయం అల్పాహారాన్ని, మధ్యాహ్నం అన్నప్రసాదాలను దాతలు అందిస్తారని అన్నారు.